## క్లుప్తంగా

### జాబ్‌కార్డు ఉన్న వారే పనులకు రావాలి



లచ్చనవలసలో మస్టర్ వెరిఫికేషన్ చేస్తున్న ఏపీఓ

రేగిడి: జాబ్‌కార్డు ఉన్న వారు మాత్రమే ఉపాధి పనులకు రావాలని ఏపీఓ ఎస్.హరనాధరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని లచ్చనవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ హరనాధరావు బుధవారం పరిశీలించారు. మస్టర్ వెరిఫికేషన్ చేసి వేతనదారులకు అవగాహన కల్పించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, జాబ్‌కార్డులు ఉన్నవారే పనులకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ, మేట్‌లు పాల్గొన్నారు.

### పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

వంగర: మండల పరిధిలోని మద్దువలస సమీపంలో లీకులమయమైన పైపులైన్‌కు బుధవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. సాక్షిలో వాటర్ ఫౌంటైన్ కాదు...పైపులైన్ లీక్ అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. సిబ్బంది మరమ్మతులు చేయడంతో పాటు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేసారు.

### 2న ఇంగ్లిష్ ప్రతిభ పరీక్ష

తెర్లాం: రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం(డెల్టా) ఆధ్వర్యంలో వచ్చే నెల 2న బొబ్బిలి రాజా కళాశాలలో ఆంగ్ల భాష ప్రతిభా పాటవ పోటీ పరీక్ష(ఇంగ్లిష్ ట్యాలెంట్ టెస్ట్)ను నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మింది విజయమోహనరావు తెలిపారు. మండలంలోని నందబలగ హైస్కూల్‌లో బుధవారం డెల్టా నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా డెల్టా ఆధ్వర్యంలో ఆంగ్ల భాష ప్రతిభా పాటవ పరీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను మినహాయించి, అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలో పాల్గొనే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. సమావేశంలో డెల్టా ప్రతినిధులు గంట సత్యనారాయణ, చింతల తిరుపతి, తేలు అప్పారావు, పుప్పాల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 63 మంది ఎంపిక




జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాస్కరరావు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 63 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 178 మంది అభ్యర్థులు హాజరయ్యారని అన్నారు. నిరుద్యోగులంతా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి టి.భాస్కర్, యశ్వంత్ పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో పాలిటెక్నిక్ బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో ఏడాదిలో లేటరల్ ఎంట్రీ ద్వారా అవకాశమున్న బ్రిడ్జి కోర్సులో చేరేందుకు శిక్షణనివ్వనున్నట్టు చెప్పారు. కోర్సులో చేరేందుకు ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ప్రాక్టికల్, థియరీ పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వివరాలకు పాస్ పోర్టు సైజు ఫొటోలు, అన్ని ధ్రువపత్రాలతో ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

### యూపీ సీఎం రాజీనామా చేయాలి

బొబ్బిలి: యూపీలో జరుగుతున్న మహా కుంభ మేళాలో జరిగిన తొక్కిసలాటలో 22మందికి పైగా భక్తులు మరణించడం దారుణమనీ, దీనికి నైతిక బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి రాజీనామా చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి, బొబ్బిలి కాంగ్రెస్ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు.

**సీపీఐ డిమాండ్**

మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు.

## ● యూరియా వినియోగం తగ్గించాలి



పంటల సాగులో రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.తారకరామారావు సూచించారు. రేగిడి మండలం పారంపేట, మునకలవలస గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సేంద్రీయ ఎరువులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మార్కెట్‌లో రాగులకు క్వింటా ధర రూ.3900 మద్దతు ధర ఉందన్నారు. ఏడీఏ చంద్రరావు, ఏఓ మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పైల తవిటినాయుడు, రమణ, రైతులు పాల్గొన్నారు. – రేగిడి

## ● ఈ నిర్లక్ష్యం ఖరీదెంత...!

రాజాం మండలం గుయ్యానవలస పంచాయతీ రామానుజలపేటలో ప్రభుత్వ సొమ్ముపై అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. గ్రామంలో అభివృద్ధి పనుల నిమిత్తం తీసుకొచ్చిన సిమెంటు బస్తాలు గడ్డలు కట్టి వినియోగానికి పనికి రాకుండా పోయింది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 200 వరకు సిమెంటు బస్తాలను కొన్నాళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేసారు. ఈ బస్తాలన్నీ పూర్తిగా గడ్డకట్టి ఎందుకు పనికిరాకుండా పోయాయి. ఈ నిర్లక్ష్యం ఖరీదెంత.. అంటూ స్థానికులు నివ్వెరపోతున్నారు. – రాజాం



## ● తప్పు చేస్తే చర్యలు తప్పవు




మహిళా సంఘాలు తీసుకున్న బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల విషయంలో వీఓఏలు డబ్బులు వసూలు చేస్తున్నట్టు రుజువైతే అటువంటి వీఓఏలపై చర్యలు తప్పవని రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి హెచ్చరించారు. రామభద్రపురం మండల కేంద్రంలో స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతిల నుంచి పొందిన రుణాలపై ముగ్గురు సభ్యులతో ఆడిట్ టీమ్ ఏర్పాటు చేసి రుణాలపై బుధవారం ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ చేసిన తీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు. స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, ఏపీఎం టి.దది కుమార్, సీసీలు పాల్గొన్నారు. – సంతకవిటి

# టమాట ధర ఢమాల్..!



రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో విక్రయానికి టమాటాలు



- కిలో రూ.4లకు పతనం
- మార్కెట్‌లో టమాటాకు గిట్టుబాటు కరువు
- కుదేలవుతున్న రైతాంగం

రామభద్రపురం: టమాట ధర రైతు నడ్డి విరిచింది. ఎంతో ఆశతో మరెంతో ముందు చూపుతో పంటను సాగు చేసిన రైతులు కుదేలయ్యారు. కొద్ది రోజుల క్రితం వరకు బహిరంగ మార్కెట్లో వినియోగదారులకు రూ.15 నుంచి రూ.20 వరకు పలికిన టమాట ధర రూ.10 పడిపోయింది. అదే టమాట రైతులు విక్రయించేసరికి రూ.4లకు కూడా కొనేవాడు కరువయ్యాడు. గతేడాది టమాట సాగుతో లాభాలు కళ్ల చూసిన రైతులు ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచారు. దీంతో జిల్లా వ్యాప్తంగా టమాట దిగుబడి అధికమైంది. ఆరుగాలం కుటుంబమంతా కష్టపడి సాగు చేసి పండించిన పంటను మార్కెట్టుకు తీసుకురాగా కొనేవాడు లేక దిక్కులు చూస్తున్నారు. దీంతో ఇదే అదునుగా బావించిన దళారులు ఒక్కసారిగా సిండికేట్ అయి ధరలు తగ్గించేసారు. రామభద్రపురం కూడలిలో టమాట ధర నేల చూపులు చూస్తోంది. ఓ వైపు అధిక పెట్టుబడులు మరో వైపు పెరిగిన సాగు విస్తీర్ణంతో రైతులకు పెట్టుబడి కూడా చేతికందని దయనీయ పరిస్థితి దాపురించింది. ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టిన రైతులకు అందులో సగం కూడా చేతికందే పరిస్థితి కనిపించడంలేదు. జిల్లాలో సుమారుగా 260 హెక్టార్లలో ట్రెల్లీస్, సాధారణ పద్ధతిలో టమాట పంట పండించగా ఇందులో రామభద్రపురం, తెర్లాం, గజపతినగరం, జామి, ఎస్.కోట, కొత్తవలస మండలాల్లో అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్నారు. ప్రకృతి సహకరించక చీడపీడలు, తెగుళ్ల సోకడంతో వేలకు వేలు పెట్టుబడులు పెట్టి ఎంతో కొంత పంటను రక్షించుకుంటున్నారు. తీరా పంటను మార్కెట్టుకు తీసుకొచ్చేసరికి మార్కెట్టులో గిట్టుబాటు ధర రాక ఆందోళన చెందుతున్నారు. 15 రోజుల క్రితం 28 కిలోలు ఉన్న క్రేట్ టమాట ధర రూ.300 నుంచి రూ.400 వరకు ఉండగా ప్రస్తుతం అదే క్రేట్ ధర రూ.100 నుంచి రూ.150 మధ్యలో పతనం అయింది. సరాసరి కిలో రూ.4 పడుతుందని రైతులు వాపోతున్నారు. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి శ్రమించి పండిస్తున్నామని తీరా మార్కెట్టుకు తెచ్చేసరికి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు...



రైతు పండిన పంటను మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవడం తలకు మించిన భారం అవుతుంది. పంట కోతకు కూలీలు, మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు తడిపిమోపెడు అవుతున్నాయి. చీడపీడలు, తెగుళ్లు నివారించడానికి పెట్టుబడి పెట్టలేక పోతున్నాం. ధర కూడా రోజురోజుకు పడిపోతుంది. ఇలాగైతే రైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది.

– రాజాన వెంకటరావు, రైతు, సోంపురం

### దిగుబడులు పెరగడం వలనే...



ఎక్కువ మంది రైతులు కూరగాయల సాగు చేపట్టడం, అలాగే పంటలు దిగుబడి పెరగడం వలన ధర తగ్గుతుంది. రైతులంతా ఒకే పంట ఒకేసారి సాగు చేయడం, డిమాండ్ లేకపోవడం కూడా ధరలు తగ్గడానికి కారణం అవుతుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు కృషి చేస్తాను. – ఏవీఎస్‌వీ జమదగ్ని, ఉద్యాన శాఖాధికారి, విజయనగరం

## వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే!

● ప్రకటించిన కేంద్ర కార్యాలయం

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బొబ్బిలి నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడిగా బేతనపల్లి శంకరరావు, మహిళా అధ్యక్షురాలిగా గులివిందల చంద్రవదన, రైతు విభాగం అధ్యక్షుడిగా నడిమింటి సత్యంనాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడిగా జి.వెంకటరమణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కండి సురేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సోముల కుమారి, మైనారిటీ అధ్యక్షుడిగా షేక్ అన్వర్ భాషా, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా రెయ్యి లక్ష్మీకుమారి, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా తెంటు తిరుపతి రావు, పంచాయితీరాజ్ విభాగం అద్దంకి దిలీప్‌కుమార్, మున్సిపల్ విభాగానికి ఇనుకోటి ఈశ్వరరావు, ఆర్‌టీఐ విభాగం అల్లాడ నగేష్‌కుమార్, వాలంటీర్స్ విభాగం కుప్ప సతీష్‌కుమార్, గ్రీవెన్స్‌సెల్ విభాగానికి వాకాడ త్రినాధరావు, వాణిజ్య విభాగానికి కోరాడ గణపతిరావు, చేనేత విభాగానికి కర్లోరి త్రినాథ్, వైఎస్సార్ టీయూసీ బారు అప్పలస్వామి, లీగల్ సెల్ పాలవలస రామనర్సింహారావు, కల్చరల్ విభాగానికి శీర తిరుపతిరావు, సోషల్ మీడియా విభాగానికి గేదెల వెంకటరమణ, ఐటీ విభాగానికి మరడాన విశ్వేశ్వరరావు, దివ్యాంగుల విభాగానికి వంగపండు వెంకట రమణ, వైద్య విభాగానికి శంబంగి వెంకట నాయుడు, ఇంటలెక్చువల్ విభాగానికి బలగ సాయికృష్ణ, బూత్ కమిటీల విభాగానికి బోను తిరుపతిరావు, పబ్లిసిటీ విభాగానికి పెద్దింటి రామారావులను అధ్యక్షులుగా నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది. వీరందరూ ఆయా విభాగాల్లో పార్టీకి సంబంధించి క్రియాశీలకంగా పని చేయాలని సూచనలు జారీ చేసింది.

### వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

రాజాం :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాజాం నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం చేపట్టారు. ఈ వివరాలను వైఎస్సార్‌సీపీ రాజాం కార్యాలయం బుధవారం ప్రకటించింది. వీరి ఎంపిక పట్ల పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌తో పాటు పలువురు అభినందనలు తెలిపారు. వీరందరూ ఆయా విభాగాల్లో పార్టీకి సంబంధించి క్రియాశీలకంగా పని చేయాలని సూచనలు జారీ చేసింది. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియామకమైన వారు పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ ఆదేశించింది.

| విభాగం | ఎన్నికైన అధ్యక్షులు |
|---|---|
| యూత్ వింగ్ | వావిలపల్లి రమణారావు |
| మహిళా విభాగం | సామంతుల అరుణ |
| రైతు విభాగం | తాడ్డి గోపాలకృష్ణ |
| బీసీ సెల్ అధ్యక్షులు | కరణం శ్రీనివాసరావు |
| ఎస్సీ సెల్ అధ్యక్షులు | బోనెల ప్రసాద్ |
| ఎస్టీ సెల్ అధ్యక్షులు | జలుమూరు బాలకృష్ణ |
| మైనార్టీ సెల్ అధ్యక్షులు | షేక్ సలీం |
| క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు | శ్యామ్ చేపూరి |
| స్టూడెంట్ విభాగం అధ్యక్షులు | కడగల భీమేశ్వరరావు |
| పంచాయతీరాజ్ వింగ్ | వాకముల్ల చిన్నంనాయుడు |
| మున్సిపల్ వింగ్ | శాసపు వేణుగోపాలనాయుడు |
| ఆర్‌టీఐ వింగ్ | వంజరాపు వెంకటవిజయ్‌కుమార్ |
| వలంటీర్ వింగ్ | దాసరి అనూష |
| గ్రీవెన్స్ వింగ్ | పిసిని శ్రీను |
| వీవర్స్ వింగ్ | బొమ్మన సూర్యనారాయణ |
| వాణిజ్య విభాగం | అన్నెపు కామేశ్వరరావు |
| వైఎస్సార్‌టీయూసీ వింగ్ | ముగడ రవి |
| అంగన్వాడీ వింగ్ | సుశీల |
| లీగల్‌సెల్ విభాగం | దూసి భవానీప్రసాద్ |
| కల్చరల్ వింగ్ | నక్క శ్రీను |
| సోషల్ మీడియా వింగ్ | వేగిరెడ్డి వీరస్వామి |
| ఐటీ వింగ్ | పాలవలస రాజగోపాలనాయుడు |
| దివ్యాంగుల విభాగం | కడగల గురివినాయుడు |
| డాక్టర్స్ వింగ్ | డాక్టర్ సవర అశోక్‌కుమార్ |
| ఇంటిలెక్చువెల్స్ ఫోరం | కెల్ల మన్మధరావు |
| బూత్ కమిటీ విభాగం | రాగోలు రమేష్‌నాయుడు |
| పబ్లిసిటీ వింగ్ | ఆసపు సూర్యం |

## కాలినడకన కాశీకి..



పాదయాత్రగా కాశీ వెళ్తున్న వెదురుపర్తి గ్రామ భక్తులు

బొబ్బిలి రూరల్: అనకాపల్లి జిల్లాలోని వెదురుపర్తి గ్రామం నుంచి కాశీ విశ్వేశ్వరుని దర్శనం కోసం కాశీ పట్టణానికి పాదయాత్రగా వెళ్తున్న నలుగురు సభ్యుల బృందం బయలు దేరగా బుధవారం బొబ్బిలి చేరుకున్నారు. వెదురుపర్తి గ్రామానికి చెందిన దొంతుకర్తు స్వర్ణనాగేశ్వరావు, సత్య ఆంజనేయులు, ఎ.హరిబాబు, రాజు కాలినడకన బయలు దేరగా కాశీని చేరుకునేందుకు దాదాపు 50 నుంచి 60 రోజులు పడుతుందని తెలిపారు. రాత్రి పూట దేవాలయాల్లో విశ్రాంతి తీసుకుని పగటిపూట పాదయాత్రగా కాశీకి చేరుకుంటామని తెలిపారు.

## రఘువర్మకు మద్దతు ఇవ్వండి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

రాజాం సిటీ: రానున్న శాసనమండలి ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ బలపర్చిన పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. స్థానిక సూర్యదుర్గ కల్యాణ మండపంలో ఉపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 'మారుతున్న పాఠశాల స్వరూపం-నూతన సవాళ్లు' అనే అంశంపై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల స్వరూపాలు మార్చడం వలన ప్రభుత్వ విద్య ప్రమాదంలో పడిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ బుకారిబాబు, పొత్తేరు శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు, నాయకులు రొతు గణపతిరావునాయుడు, మక్క అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై సర్వే



కాలువ ఆక్రమణలు పరిశీలిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: పట్టణంలోని చెరువులు, కాలువల ఆక్రమణలపై మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం సర్వే నిర్వహించారు. ఆరు రెవెన్యూ గ్రామాలతో ఏర్పడిన రాజాం మున్సిపాలీలో చెరువులు, కాలువలు గుర్తించడంతో పాటు వాటి ఆక్రమణలపై ఆరా తీస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా తొలుత ఐదు కాలువలు, రెండు చెరువులు గుర్తించామని, రెవెన్యూ రికార్డుల ప్రకారం వాటి విస్తీర్ణంపై సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించడమే కాకుండా వాటిని పటిష్టం చేయిస్తున్నామని అన్నారు. డోలపేట జంక్షన్ నుంచి వాసవీనగర్, అంతకాపల్లి వెళ్లే కాలువలు, సారధి రోడ్డులోని, ఆదర్శనగర్‌లోని కాలువలతో పాటు జీఎంఆర్ ఐటీకి ఆనుకుని ఉన్న కాలువను పరిశీలించారు. మల్లమ్మ, రంగప్ప చెరువుల విస్తీర్ణంపై ఆరా తీసారు. వీటిని యథాస్థితికి తీసుకురావాలని సిబ్బందికి ఆదేశించారు. ఆక్రమణదారులు అధికారులకు సహకరించాలని, స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని సూచించారు. టీపీఓ తేజేశ్వరరావు, ఏఈ వెంకట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక గురువుకు కన్నీటి వీడ్కోలు

రేగిడి : మండలంలో రేగిడి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడుకు ప్రజలు బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రేగిడి, రాజాం, సంతకవిటి, వంగర, చీపురుపల్లి, ఎచ్చెర్ల, పాలకొండ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావుతో పాటు అతని సోదరులు, కుటుంబీకులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## రక్షిత నీటి పథకాల పరిశీలన



అంతకాపల్లిలో రక్షిత పథకం ట్యాంకును పరిశీలిస్తున్న జేఈ

రాజాం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకాల ట్యాంకుల నిర్మాణాలను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వి.జగన్మోహనరావు బుధవారం పరిశీలించారు. అంతకాపల్లిలో రూ. 52.80 లక్షలు, మొగిలివలసలో రూ.68.20 లక్షల నిధులు కేటాయించి భారీ రక్షిత పథకాల ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా పంచాయతీలో ప్రజలందరికీ పూర్తి స్థాయిలో తాగునీరు అందనుందని అన్నారు. ఆయన వెంట సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు ఉన్నారు.

## డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల తస్మాత్..: డీఎస్పీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: విద్యార్థులు డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ జి.భవ్యారెడ్డి పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం యంత్రాంగం ఏర్పాటు చేసిన సంకల్ప రథం బొబ్బిలి వచ్చిన సందర్భంగా పట్టణంలోని పలు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ భవ్యారెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వలన జీవితం పాడవుతుందన్నారు. సమాజంలో చెడ్డ పేరు వస్తుందని, పోలీసు కేసులతో శిక్ష పడి జైలు జీవితాలు గడపాల్సిన ప్రమాదాలుంటాయన్నారు. అలాగే సైబర్ నేరాలనుంచి ఎలా తప్పించుకోవాలో వివరించారు. ఆన్‌లైన్ గేమింగ్, సెల్‌ఫోన్లలో తప్పుడు సైట్లను ఓపెన్ చేయడం వలన కలిగే దుష్పరిణామాలను వివరించారు. సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్ఐలు ఆర్.రమేష్, వి.జ్ఞానప్రసాద్, స్వామి, సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ బాగుండాలి

రాజాం సిటీ: గ్రామాల్లో నిర్వహిస్తున్న సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధి బొద్దాం గ్రామంలోని సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు.